చెరువు కబ్జా.. దుర్గంధం


తాజ్ బంజారా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

- బంజారా చెరువును కప్పేసిన గుర్రపుడెక్క
- తొలగించని అధికారులు
- దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- అటకెక్కిన చెరువు సుందరీకరణ

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన నీటితో కళకళలాడాల్సిన బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా చెరువు ఒకవైపు కబ్జాకు గురవుతుండగా, మరోవైపు దుర్గంధంతో కలుషితమైపోతోంది. చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో చెరువు పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. చెరువు నీటిలో గుర్రపుడెక్క, మురుగునీటిని ఆవాసంగా చేసుకుని దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన చెరువు..

తాజ్‌బంజారా చెరువుకు వంద సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో ఇక్కడ ఉన్న వ్యవసాయ భూములకు ఈ చెరువు నుంచే నీటి సరఫరా జరిగేదని స్థానికులు చెబుతారు. ప్రజల తాగునీటికి ఈ చెరువును ఉపయోగించేవారు. అంతటి చరిత్ర ఉన్న బంజారా చెరువు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతుంది. చెరువు మొత్తం గుర్రపుడెక్కతో నిండిపోయింది. చెరువులో కనీసం నీరు కనిపించడం లేదు. దీనికితోడు మురుగు నీరు చెరువులో చేరడంతో చెరువు నీరు దేనికి ఉపయోగించలేని స్థితికి చేరింది. నీటి శుద్ధీకరణ పేరుతో అధికారులు హడావుడి చేశారే తప్పా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోలేదు. ఎగువ భాగం నుంచి వస్తున్న మురుగును ఆపితే సగం కాలుష్యం తగ్గుతుంది. కాని ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నాలా నుంచి వచ్చి చెరువులో కలిసే మురుగునీరు శుద్ధి చేసేందుకు గతంలో పలు యంత్రాలు అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇందుకోసం కొద్ది రోజులు ట్రయల్ రన్ జరిగింది. కాని ఇది పూర్తి స్థాయిలో అమలులోకి రాలేదు. ఇప్పటికీ కొంతమంది భవన నిర్మాణ సామగ్రిని, ఇంట్లోని వ్యర్థ పదార్థాలు తీసుకువచ్చి చెరువులో వేస్తుండటంతో కాలుష్యం మరింత పెరుగుతుంది. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి అధికారులపై ఒత్తిడి తెస్తే తాజ్ బంజారా సంరక్షణ సాధ్యమైతుంది. లేని పక్షంలో చెరువు పూర్తిగా నిరుపయోగంగా మారే అవకాశం ఉంది.

అధికారులకు ఫిర్యాదు చేసినా...

తాజ్‌బంజారా చెరువు చుట్టూ 10కి పైగా ప్లాట్లు తయారు చేశారు. మరో 20 మంది చెరువు ఎఫ్‌టీఎల్ గోడలు నిర్మించుకుని పార్కులు తయా రుచేసుకున్నారు. చెరవుఉ బఫర్ జోన్ కబ్జాకు గురవుతుందని, దీని వల్లనే చెరువులో దుర్గంధం పేరుకుపోతుందని స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు చుట్టూ ఇప్పటికే అలాగే చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోయిందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఇటు ఇరిగేషన్ అధికారులకు, అటు జీహెచ్‌ఎంసీ అధికారులకు కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి దీనిపై స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో తాము రోజూ దుర్గంధం, దోమలతో కుస్తీ పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సుందీరకరణ ఏదీ..?

తాజ్ బంజారా చెరువు సుందరీకరణ పనులు అటకెక్కాయి. చెరువు సుందరీకరించేందుకు రూ.రెండు కోట్ల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. సుందరీకరణ పనులకు అధికారులు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అంతే ఆర్భాటంగా ముగించేశారు. కేవలం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు ఆ వాకింగ్ ట్రాక్ కూడా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అదే విధంగా అంబేడ్కర్‌నగర్, సింగాడికుంట, ఉదయ్‌నగర్ బస్తీల నుంచి చెరువులోకి మురుగునీరు రాకుండా కోట్లాది రూపాయలు వెచ్చించారు. అది కూడా వృథాగా మారింది. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకునీరత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెరువులోని గుర్రపుడెక్కను తొలగించడంతో పాటు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
- బేగంపేట, ఆంధ్రజ్యోతి

ఎల్లమ్మ కల్యాణానికి ఆహ్వానం



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో జరగనున్న అమ్మవారి కల్యాణానికి హాజరుకావాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు రోహిణిరెడ్డిని ఆలయ అర్చకులు, కమిటీ నాయకులు గురువారం ఆహ్వానించారు.
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


ఎర్రగడ్డలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్

ఎర్రగడ్డ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లో కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. డివిజన్‌లోని సుల్తాన్‌నగర్, నేతాజీనగర్‌లలో సీసీరోడ్లు, సీవరేజ్ పైప్‌లైన్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జనప్రియ అపార్టుమెంట్ పక్కన ఉన్న ఓవైసీ ప్లేగ్రౌండ్ పార్కు పెండింగ్ పనులను పూర్తి చేయాలని, ఫాతిమానగర్ లో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్‌ను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా సుల్తాన్‌నగర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు పనులను త్వరగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వంశీకృష్ణ, భరత్, శేఖర్, ప్రేమ్‌కుమార్, షకీల్, ఎంఐఎం పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్వర్‌సాదత్, నాయకులు మహమ్మద్ అజార్, మహమ్మద్ ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళాభట్ నాట్య సేవలు చిరస్మరణీయం

పంజాగుట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆదర్శ నాట్య గురు, నర్తకీమణి మంగళాభట్ సేవలు చిరస్మరణీయమని ప్రముఖులు కొనియాడారు. హోటల్ గ్రీన్ పార్క్‌లో ఆకృతి కథక్ కళాకేంద్రం వ్యవస్థాపకురాలు మంగళాభట్ సంస్మరణ, సమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళాభట్ స్నేహితులు, శిష్యులు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమెతో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శిల్పారామం స్పెషల్ ఆఫీసర్, సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు మాట్లాడుతూ కథక్‌లో విశేష ప్రయోగాలు చేసిన మంగళాభట్ లేని లోటు తీరనిదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డా.అలేఖ్య పుంజాల, మంగళాభట్ భర్త రాఘవరాజ్‌భట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఆనందాశంకర్, సంగీత నాటక అకాడమీ పూర్వ అధ్యక్షురాలు దీపికారెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు డా. కళాకృష్ణ, డా.భాగవతుల సేతురామ్, డా.వనజ ఉదయ్, డా.యశోద ఠాకూర్, సీనియర్ జర్నలిస్ట్ డా.మహ్మద్ రఫీ, ప్రముఖ శిల్పి ఎంవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణం

- సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి

బేగంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి కాంట్రాక్టర్‌కు సూచించారు. సనత్‌నగర్‌లోని దాసారం బస్తీ నల్లపోచమ్మ ఆలయం నుంచి బెంగళూరు అయ్యంగార్ బేకరీ వరకు సుమారు రూ.31 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో పలు సంక్షేమ, అభివృద్ధి పనులను పెద్దఎత్తున అమలు చేశామని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు సీసీ రోడ్డును అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, షాబాద్, శ్రీనివాస్, నాగరాజు, విజయసింగ్, నజీర్, పురుషోత్తం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, విశ్వేశ్వరయ్య తదితరులు

శ్రీమద్భగవద్గీత సంపూర్ణ పారాయణం పోస్టరు ఆవిష్కరణ

పంజాగుట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణం వందే జగద్గురుం ఫౌండేషన్, గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండో ఆదివారం శ్రీమద్భగవద్గీత సంపూర్ణ పారాయణంను రవీంద్రభారతి మినీహాల్‌లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ గోసుల శ్రీనివాస్‌యాదవ్, గీతా ఫౌండేషన్ అధ్యక్షుడు బడే సాబ్, గీతా ప్రచారక్ విశ్వేశ్వరయ్య, సరోజని, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, నక్క శ్రీనివాస్‌యాదవ్ సంపూర్ణ పారాయణం పోస్టరును ఆవిష్కరించారు. సీబీఎస్‌ఈలో భగవద్గీత ఒక పాఠ్యాంశంగా ఉందని, రాష్ట్ర సిలబస్‌లోనూ ఒక పాఠ్యాంశంగా చేర్చాలని త్వరలో సీఎంను కలిసి విన్నవించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆషాఢ మాస పూజలు ప్రారంభం

ఖైరతాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రులు ఆరాధ్య దైవంగా భావించే హుస్సేన్‌సాగర్ ఒడ్డున గల గంగమ్మ దేవాలయంలో ఆషాఢమాస పూజలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు నేతృత్వంలో గురువారం ఆలయంలో గంగమ్మకు పూజలు చేసి ఆషాఢ మాసం పూజలను ప్రారంభించారు. ఆగస్టు 17న గంగ తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని మహేందర్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గంగపుత్రులు డిమాండ్ చేశారు. గంగపుత్ర సంఘం నాయకులు రాజు, మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి, ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కార్పొరేటర్ మహేశ్వరి, పలు విభాగాల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. బ్రాహ్మణవాడిలోని లేన్ నెంబరు 1లో కొన్ని సంవత్సరాలుగా మురుగు నీటి సమస్య ఉందని, ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో మంచినీటిలో కలుషిత నీరు, మురుగుసమస్య, వీధి దీపాలు వెలగడం లేదని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీనిచ్చారు. బ్రాహ్మణవాడిలో ప్రత్యేక పైపులైన్ వేసి మురుగునీటి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులు ప్రస్తుతం ఆగిపోయాయని, బీఆర్‌ఎస్‌కు మంచి పేరు వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ఆపిందని ఎమ్మెల్యే ఆరోపించారు.


సీవరేజ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకుముందు బ్రాహ్మణవాడిలో నూతనంగా నిర్మిస్తున్న సీవరేజ్ పనులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రాజయ్య, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, కార్తీక్, ఆరీఫ్, వాహెద్, సాబేర్, నరేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలి

- మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

పంజాగుట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని స్థానిక సంస్థల ఎన్నికల లోపు అమలు చేయాలని మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత గిరిజన ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అంబేడ్కర్ అభయ హస్తం సాధన, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో మహా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్యపాగ నర్సింగరావు, భారత జాతీయ ఎరుకల కులవృత్తుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కండెల వెంకటేష్, టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజుమాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు జన్ను కనకరాజు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాదిగ శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజని, వివిధ సంఘాల నాయకులు రాములు, రవి, రాజమల్లు, రాజేందర్, టాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సూర్యతేజ్ షార్ట్‌ఫిలిం

హైటెక్‌సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సూర్యతేజ్ రూపొందించిన షార్ట్‌ఫిలిం అందరిని ఆలోచింపజేసింది. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం శిల్పకళావేదికలో సూర్యతేజ తీసిన షార్ట్ ఫిలింను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ యాంటీ నార్కొటిక్ బ్యూరో, మిషన్ పరివర్తన, సైబర్ సెక్యూరిటీ, మహిళా భద్రత విభాగం, సిటీ పోలీసు ఆయుధాలు, ఇనిస్టిట్యూట్ హెల్త్ విభాగాల వారు స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి అన్ని స్టాళ్లను పరిశీలించారు. ఆయుధాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సినీ హీరోలు రామ్‌చరణ్‌తేజ్, విజయదేవరకొండ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


టీజీఎస్‌పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కృష్ణారెడ్డికి అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సత్కారం

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని తెలంగాణ విద్యుత్ అకౌంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు విద్యుత్ భవన్‌లో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని నియమించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీజీఎస్‌పీసీఎల్ సీఎండీ ముషరఫ్ ఫారూక్ అలీలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు షరీఫ్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పరమేశ్వర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


సీజ్ ఫైర్ చేసే విధానాన్ని చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదంపై మాక్ డ్రిల్

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భారీ అపార్ట్‌మెంట్లలో సందర్భాల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై ఎలా వ్యవహరించాలని వివరిస్తూ గురువారం అగ్ని మాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫిలింనగర్ అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది షేక్‌పేట స్కై హై హర్ష టవర్స్‌లో అగ్ని ప్రమాదాల సమయాల్లో ఎలా వ్యవహరించాలో, ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్థానికులకు, విద్యార్థులకు వివరించారు.

ప్రమాదం జరిగితే..

అగ్గి రాజుకోగానే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆ తరువాత ప్రాంగణంలో సీజ్ ఫైర్‌తో వీలైనంత వరకు మంటలను ఎలా అదుపు చేయాలో అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అలాగే మంటల్లో చిక్కుకున్న వారికి ప్రాథమిక చికిత్స అందించే విధానాన్ని వివరించారు. పొగ వల్ల సొమ్మసిల్లిన వారిని నేల మీద పడుకోబెట్టి బెలూన్ ద్వారా గాలిని అందించాలని, ఛాతి మీద నొక్కాలని సూచించారు. పై అంతస్తుల్లో ప్రమాదం జరిగిన సందర్భంలో ఫైర్ సిబ్బంది నీటిని చిమ్మి ఏ విధంగా మంటలను ఆర్పుతారో చూపించారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారు విద్యార్థులకు సూచించారు. అధికారుల సూచనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.రమేష్, జూబ్లీహిల్స్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం: దీపక్‌రెడ్డి

బోరబండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బస్తీలో నివసించే పేదలకు కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి విమర్శించారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీలోని వివిధ బస్తీలలో పార్టీ కార్యకర్తలతో కలిసి గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలలో డ్రైనేజీ, రహదారులు, తాగునీరు, పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు నివసించే ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బోరబండ సైట్-3 వద్ద నుంచి మాదాపూర్, పరిసర ప్రాంతాలకు వెళ్లే మార్గంలో నవభారత్‌నగర్ సమీపంలో ప్రైవేటు వ్యక్తులు ప్రహరీ ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని పలువురు మహిళలు దీపక్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే దీపక్‌రెడ్డి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థల యజమానితో సెల్‌ఫోన్‌లో మాట్లాడి ప్రజల కోసం దారిని వదలాలని దీపక్ కోరారు. అంతకుముందు బోరబండలోని వీరాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిధులతో వేయిస్తున్న పవర్ బోర్ పనులను దీపక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపి బోరబండ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, పార్టీ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, పూజారి శరణ్‌రెడ్డి, కృష్ణ, కృష్ణమోహన్, శ్రీనివాస్, అన్నపూర్ణమ్మ, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.


కాలనీలోని సమస్యలను పరిశీలిస్తున్న దీపక్‌రెడ్డి

'కజకిస్థాన్‌లో పెట్టుబడులను ప్రోత్సహించండి'

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కజకిస్థాన్‌లో తెలంగాణ పెట్టుబడులను ప్రోత్సహించాలని, నగరం నుంచి కజకిస్థాన్‌కు ప్రత్యేక విమాన సర్వీసులు ప్రారంభిస్తే వాణిజ్యం, పర్యాటకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాలలో ఆర్థిక సంబంధాలు బలోపేతం అవుతాయని తెలుగు రాష్ట్రాల కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ డా.మీర్ నాసిన్ అలీఖాన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల కజకిస్థాన్ రాయబారిగా నియమితులైన అజమత్ యేస్కరావ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ కజకిస్థాన్‌ల మధ్య సంబంధాలపై కాసేపు చర్చించారు. కజకిస్థాన్‌లో తెలంగాణ పెట్టుబడులను ప్రోత్సహించేలా కృషి చేయాలని కోరారు.


అజమత్‌ను కలిసిన తెలుగు రాష్ట్రాల కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ డా. అలీఖాన్


మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెపా నాయకులు

ముదిరాజులకిచ్చిన హామీలను అమలు చేయాలి

పంజాగుట్ట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ తోపాటు, ముదిరాజ్‌లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్‌ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మెపా ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రి వాకిటి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడుతూ, మత్స్యకారులకు ప్రస్తుతం ఉన్న ప్రమాద బీమా మొత్తాన్ని పెంచాలని, 55 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవన్‌కుమార్, రాజు, గౌరవ సలహాదారు పులి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్మోహన్, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

60 కోట్ల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన అధికారులు

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 2 సర్వే నెంబరు 403లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం ఉంది. రూ.60 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో కొంత స్థలం కోర్టు వివాదంలో ఉంది. ఆ స్థలంలో కొంతమంది ఇనుప రేకులతో షెడ్లు నిర్మించి ఆక్రమించేందుకు పథకం వేశారు. సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి విషయాన్ని రెవెన్యూ సిబ్బందికి చెప్పింది. తహసీల్దార్ ఆదేశాలతో సిబ్బంది గురువారం బుల్‌డోజర్‌తో రేకుల షెడ్డును కూల్చివేశారు. ఈ స్థలంలో కొంతభాగం కోర్టు వివాదంలో ఉందని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో అనితారెడ్డి తెలిపారు.


రేకుల షెడ్డును కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: ఏసీపీ

ఖైరతాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపకూడదని సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్ డ్రైవర్లకు సూచించారు. పాఠశాలలకు విద్యార్థులను తరలించే బస్సులు, వ్యాన్‌లు, ఆటోల డ్రైవర్లకు సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం మోహన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


స్కూల్ బస్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న టెంపెస్ట్ ఉద్యోగులు

'సైలెంట్ నో మోర్' ప్లకార్డుల ప్రదర్శన

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం టెంపెస్ట్ సంస్థ ఉద్యోగులు సైలెంట్ నో మోర్ నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని జూబ్లీహిల్స్, అమీర్‌పేట, మాదాపూర్ ప్రాంతాల్లో ప్లకార్డులు ప్రదర్శించారు. మాదక ద్రవ్యాల బారి నుంచి బయటపడాలని భావించే వారు ప్లకార్డుల్లో ఉన్న కోడ్‌ను స్కాన్ చేస్తే సోబర్ రిహాబ్ కౌన్సెలింగ్ సంస్థ వివరాలు వస్తాయని ఉద్యోగులు చెప్పారు. అనేక మంది నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చి మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడతారని వారు చెప్పారు.

తిరుమలగిరి చెరువుకు మహర్దశ

పూర్తయిన రింగ్ సీవర్ పనులు ● స్థానికులకు ఉపశమనం


తిరుమలగిరి చెరువు

సికింద్రాబాద్, తిరుమలగిరి జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి చెరువులో మురుగు నీరు చేరకుండా వాటర్ బోర్డు అధికారులు చేపట్టిన రింగ్ సీవర్ పనులు పూర్తి కావడంతో స్థానికులకు ఉపశమనం లభించినట్టయింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని తిరుమలగిరి చెరువు చాలా కాలంగా కాలుష్యమయమైంది. అటు వర్షపునీరు, ఇటు మురుగు చేరుతుండడంతో దుర్వాసన వెలువడుతూ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలను ముప్పతిప్పలు పెడుతోంది. రాత్రి వేళల్లో దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు తలుపులు, కిటికీలు తెరవడానికి భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ సమస్య నుంచి తమను రక్షించాలంటూ ఎన్నో ఏళ్లుగా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు కొంత మేరకు పనులు చేపట్టారు. అయితే పనులు పూర్తి కాకపోవడంతో ప్రజల బాధలు తీరడం లేదు. కొద్ది నెలల క్రితం కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం చొరవ కారణంగా వాటర్ బోర్డు రింగ్ సీవర్ పనులు ప్రారంభించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ పనులు గురువారం పూర్తయ్యాయి. దాంతో ఇక నుంచి తిరుమలగిరి చెరువులో మురుగు నీరు చేరే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు. ఫలితంగా సమస్య తీరినట్టేనని వారు స్పష్టంచేశారు.

సుందరీకరణ పనులు మిగిలాయి

ఇక చెరువు సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి ప్రభుత్వం ముందుకు రావడంతో కొద్ది రోజుల క్రితం కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో చర్చ జరిగింది. చెరువు సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతున్నదని, హెచ్‌ఎండీఏకు ఆదేశాలు జారీ చేసిందని స్థానిక శాసన సభ్యుడు ఎన్.శ్రీగణేష్ ప్రస్తావించారు. పనులు చేపట్టడానికి హెచ్ఎండీఏకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. దీనికి కంటోన్మెంట్ బోర్డు అధికారులు స్పందించి ఎన్‌ఓసీ జారీ చేశారు. తాజాగా రింగ్ సీవర్ పనులు కూడా పూర్తి కావడంతో తిరుమలగిరి చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించడానికి మార్గం సుగమమైందని చెప్పవచ్చు.

పరిశీలించిన అధికారులు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఉమాశంకర్, దేవేందర్, దినేష్, పుష్పేందర్‌లు, వాటర్ బోర్డు అధికారులు అరుణ్, ఉదయ్‌లు గురువారం తిరుమలగిరి చెరువు పరిసరాలను సందర్శించారు. రింగ్ సీవర్ పనులు పూర్తి చేసిన తీరు తెన్నులు పరిశీలించారు.


తిరుమలగిరి చెరువును సందర్శించిన కంటోన్మెంట్, వాటర్ బోర్డు అధికారులు

ప్రక్షాళన పనులు చేపట్టాలి



ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించింది. చెరువులోకి మురుగునీరు రాకుండా చేపట్టిన ప్రాజెక్టు పూర్తికావడం సంతోషం. ఇప్పటికి కూడా ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల నుంచి మురుగు చెరువులోకి వచ్చే ప్రమాదం ఉంది. వాటిని కూడా అరికడితే బాగుంటుంది. తొందరగా చెరువు ప్రక్షాళన పనులు చేపట్టాలి.

సతీష్ (మలాని కాలని)

మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి



చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టి సాయంత్రం వేళ ఆహ్లాదంగా ఉండడానికి, వాకింగ్ చేసుకోవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ చెట్లను నాటాలి. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేయాలి. తిరుమలగిరి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నాం.

రాకేష్ (మలాని కాలని)


బస్తీలోని సమస్యలను తెలుసుకుంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

జైనగర్ కాలనీలో తలసాని పర్యటన

పద్మారావునగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాలనీ ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటూ సమస్యలను తన దృష్టికి తేవడం ద్వారా పరిష్కరించుకోవాలని సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జైనగర్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలసి పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు తలసానికి విన్నవించారు. నూతన రోడ్ల నిర్మాణానికి, విద్యుత్ స్తంబాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక ప్రజల అవసరార్థం కమిటీ హాలును నిర్మించామని, దానిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత, ఈఈ సుబ్రమణ్యం, డిప్యూటీ ఈఈ అంజనేయులు, వెంకటేశన్‌రాజు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఏసూరి మహేశ్, వెంకట్, ముక్కా శ్రీనివాస్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు.. దుర్వాసనతో ఇబ్బందులు


గాంధీ ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్త

అడ్డగుట్ట, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి ఆవరణలో చిన్నపిల్లల వార్డు సమీపం ప్రాంతం చెత్త డంపింగ్ యార్డులా తయారు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెత్త పక్కనే అప్పుడే పుట్టిన శిశువులు వార్డు ఉన్నప్పటికీ ఈ విషయంలో ఎవరు పట్టించుకోవడంలేదు. ఆస్పత్రిలో చెత్తను తీసుకొచ్చి వేయడంతో రోగుల సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 28న జిల్లా కలెక్టర్ గాంధీ ఆస్పత్రిలో తనిఖీల కోసం వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ చెత్త కుప్పలను తరలించాలని రోగులతో పాటు సహాయకులు కోరుతున్నారు.

బోనాల వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

రెజిమెంటల్‌బజార్,జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మహంకాళి డివిజన్ ఏసీపీ సైదయ్య అన్నారు. గురువారం మార్కెట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బోనాల ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రాంచందర్ మాట్లాడుతూ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐ ఎండీ షకీర్ అలీ, ఎస్సై గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని

మర్యాదపూర్వక కలయిక

బౌద్ధనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగంలో నూతన అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా బాధ్యతలు చేపట్టిన పావని గురువారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేశారు. పట్టణ ప్రణాళిక విభాగం కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు తమ సేవలను అందుబాటులో నిలపాలని పద్మారావుగౌడ్ ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ నాక్ ఇంజనీర్ ప్రకాశ్, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, నాయకులు రాజుసుందర్, బెజ్జంకి రాజేశ్, సుమిత్‌యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో పాత నేరస్తుడు జైలుకు

మారేడుపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన పాత నేరస్తుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచి అక్కడి నుంచి జైలుకు తరలించారు. డీఐ రాజశేఖర్ కథనం ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బాబర్ అలియాస్ బకార్ అక్రం(32) జల్సాలకు అలవాటు పడి చోరీల బాట పట్టాడు. ఇతడిపై నగరంలోని ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, మాదాపూర్, అంబర్‌పేట్, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, చాదర్‌ఘాట్, చార్మినార్‌తో పాటు ఇతర పోలీస్‌స్టేషన్లలో 94 చోరీ కేసులు నమోదయ్యాయి. అలాగే కార్ఖానా పరిధిలో 2015లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో నిందితుడు ఆ సమయంలో కోర్టుకు హాజరు కాలేదు. దీంతో కోర్టు అతడికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తాజాగా ముంబయిలోని ఆధర్‌వాడీ జైల్లో ఉన్న అతడిని కార్ఖానా పోలీసులు తీసుకువచ్చి గురువారం కోర్టు ముందు ప్రవేశపెట్టారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రైలు ఎక్కుతూ కింద పడి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రయాణికుడి మృతి


ఖైలాష్ చంద్ర రస్తోగి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు ఎక్కబోతున్న ఓ ప్రయాణికుడు కింద పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖైలాష్ చంద్ర రస్తోగి(49) బతుకుదెరువు కోసం చెన్నైకి వెళ్లేందుకు 24న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ప్లాట్ ఫాం-1 పై ఉన్న చెన్నై ఎక్స్‌ప్రెస్ కదులుతున్న సమయంలో రైలు ఎక్కబోతు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అతడిని వైద్యం నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 25న మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో బ్యాగు చోరీ.. నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న రైల్వే డీఎస్‌పీ జావీద్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రైలులో బంగారు నగల బ్యాగును చోరీ చేసిన నిందితుడిని లింగంపల్లి జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ డీఎస్‌పీ జావీద్, లింగంపల్లి జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్‌కు చెందిన బల్ల సాగర్ అనిల్ కుమార్(32) ఈ నెల 24న లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో లింగంపల్లి-కాకినాడకు వెళ్లే రైలులో ఓ ప్రయాణికురాలి బ్యాగును దొంగలించాడు. గురువారం లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.. 24న రైలులో బ్యాగును తస్కరించానని నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ బ్యాగ్‌లో రూ.2 లక్షల విలువ చేసే 200 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయని డీఎస్‌పీ తెలిపారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఏజెంట్లను, అధికారిని ప్రశ్నిస్తున్న ఏసీబీ వర్గాలు

ఆర్టీఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

తిరుమలగిరి జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచే అధికారులు పలు బృందాలుగా విడిపోయి తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయానికి చేరుకుని ఏజెంట్లు చేస్తున్న దందాను పసిగట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. పక్కా నిఘా ఉంచిన బృందాలు 20మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారినుంచి నగదు, పలు వాహన ధ్రువీకరణ పత్రాలు, సెల్‌ఫోన్లు, ఇతర డాక్యుమెంట్లు దొరికాయని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఏజెంట్ల ఫోన్లను స్వాధీనం చేసుకొని అందులోని సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీఓ సిబ్బందిపై కూడా పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారిని కూడా విచారిస్తామని అన్నారు. ఆర్టీఓను కూడా అన్ని కోణాల్లో విచారించి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఒక్కో ఏజెంట్ దగ్గర 50 వాహన ధ్రువీకరణ పత్రాలు లభించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. రాత్రి వరకు ఏసీబీ సోదాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.


ప్యాచ్ వర్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రోడ్డు పనులు పూర్తిచేయాలి

రాంగోపాల్‌పేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరుగనున్న ఆషాఢ బోనాల ఉత్సవాల ప్రధాన ఘట్టమైన ఘటోత్సవంలోగా డివిజన్ పరిధిలోని అన్ని ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేయాలని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో జరుగుతున్న రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవం సందర్భంగా ప్రధానంగా అమ్మవారి ఘటం బుద్ధభవన్ ఎదురుగా గల ఇందిరానగర్‌లోని మహంకాళి అమ్మవారి దేవాలయం నుంచి డిస్టిలరీ రోడ్డు, విక్టోరియా గంజ్ చౌరస్తాల మీదుగా దేవాలయానికి వస్తుందని యుద్ధప్రాతిపాదికన ఆ రోడ్డుకు మరమత్తులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సహ కోశాధికారి ఎస్సార్ మల్లేష్, డివిజన్ నాయకులు ప్రవీణ్, చీర శ్రీనివాస్, కోమల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయంఉపాధిలో శిక్షణ


సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న కావ్యా కిషన్‌రెడ్డి, చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్(ఏబీఏ ఫౌండేషన్) ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషన్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తదితర స్వయంఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఏబీఏ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్యా కిషన్‌రెడ్డి అన్నారు. ఆమె గురువారం శిక్షణ పొందిన మహిళలకు కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌తో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో గత పది సంవత్సరాల నుంచి స్కిల్ సెంటర్లలో వివిధ వృత్తి నైపుణ్య శిక్షణలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన మంచి కార్యక్రమమని అన్నారు. తమ డివిజన్‌లో ఈ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణను అందజేస్తున్నందుకు కావ్య కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏబీఏ ఫౌండేషన్ సమన్వయకర్త నీరజ, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి అశ్వినీ భైరిశెట్టి, డివిజన్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు నిర్మల, ఓమిని, జయారెడ్డి, నాయకులు ధన్‌రాజ్, గోపి కిషన్, చీర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో హుండీ లెక్కింపు


ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో హుండీ లెక్కింపు

సికింద్రాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో హుండీని గురువారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం కార్యనిర్వహణాధికారి సత్యమూర్తి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు సురిటి రామేశ్వర్, సురిటి కామేశ్వర్‌ల పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో లెక్కించగా రూ24లక్షల 47వేల 518 (నోట్లు), రూ2లక్షల 7వేల 151 కాయిన్లు హుండీ ఆదాయంగా వచ్చింది. 1,095 గ్రాముల బంగారం, 10,500 గ్రాముల వెండి కూడా వచ్చింది. కాగా కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ తదితర నేతలు కూడా హుండీ లెక్కింపును పరిశీలించారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

చిలకలగూడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దమరైల్వే సికింద్రాబాద్, ఆర్ఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో గురువారం జీహెచ్ రైసోని మోమోరియల్ యెనిక్స్ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల మెయిన్ డ్రా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించినప్పుడే ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన మేడ్చల్ మల్కాజ్‌గిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్రానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపియన్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు సుమిత్ రెడ్డిరైసోని ఫౌండేషన్ డైరక్టర్ పూనమ్ పాండే, యు.వి.యన్.బాబు, కానూరి వంశీధర్, వికాస్, నాగరాజు పాల్గొన్నారు.

రక్త సంబంధ వ్యాధులపై అవగాహన అవసరం

- పిల్లలకు పాఠశాల స్థాయిలో స్క్రీనింగ్ చేయించాలి
- 8 - 10 శాతం పిల్లల్లో థలసేమియా
- హిమోగ్లోబినోపతిలపై కిమ్స్ ఆసుపత్రిలో సదస్సు


వైద్య కళాశాల విద్యార్థులు, బయో కెమిస్టులు, పాథాలజిస్టులతో కిమ్స్ వైద్యులు

రాంగోపాల్‌పేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో కనిపించే జన్యుపరమైన రక్త సంబంధ వ్యాధులపై తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు, వైద్యులు అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచించారు. హిమోగ్లోబినోపతిలపై కిమ్స్ ఆసుపత్రిలో గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. సదస్సులో దాదాపు 150 మందికి పైగా వైద్య కళాశాల విద్యార్థులు, బయోకెమిస్టులు, పాథాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి హీమటో - అంకాలజీ విభాగాధిపతి, బోన్ మారో మార్పిడి నిపుణుడు డాక్టర్ నరేంద్రకుమార్ తోట మాట్లాడుతూ హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న పిల్లలను వేరుచేసి వారికి మరింత నిర్ధారణ పరీక్షలు చేయాలని, సాధారణ రక్తహీనతేనా లేదా థలసీమియానా, సికిల్ సెల్ లాంటి జన్యుపరమైన వ్యాధులా అన్నది నిర్ధారించాలన్నారు. కిమ్స్ ఆసుపత్రుల ల్యాబ్ విభాగాధిపతి డాక్టర్ రాధికా చౌదరి సదస్సుకు నేతృత్వం వహించగా, డాక్టర్ మహమ్మద్ మౌనుద్దీన్, డాక్టర్ ఎం.ఎ ముకీత్‌లు కార్యనిర్వాహక కార్యదర్శులుగా వ్యవహరించిన ఈ సదస్సులో కిమ్స్ కడల్స్ ఆసుపత్రి పీడియాట్రిక్ హీమటో - అంకాలజీ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ చందన మారెడ్డి, సీనియర్ జెనెటిక్ కౌన్సిలర్ డాక్టర్ పావనీ ఉపేంద్రం, నిమ్స్ ఆసుపత్రి బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నూర్జాహాన్ పాల్గొని మాట్లాడారు.

మాదక ద్రవ్యాల నివారణపై ర్యాలీ


మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బౌద్ధనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలు పురస్కరించుకుని గురువారం చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ర్యాలీలో చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు, కానిస్టేబుల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తార్నాకలో

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మల్కాజ్‌గిరి జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ నవీన్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పలువురు రాజకీయ నాయకులతో కలిసి గురువారం లాలాపేట్‌లోని ప్రొ.జయశంకర్ స్టేడియం నుంచి శాంతినగర్ చౌరాస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నేడు జగన్నాథ రథయాత్ర

రాంగోపాల్‌పేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : శుక్రవారం జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు జనరల్ బజార్‌లోని శ్రీజగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు పురుషోత్తం మలాని తెలిపారు. ట్రస్ట్ గత 130 సంవత్సరాలుగా సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ ఆలయం నుంచి ఈ రథయాత్రను క్రమం తప్పకుండా నిర్వహిస్తుందని వివరించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు దేవాలయం నుంచి రథయాత్ర బయలుదేరి జనరల్ బజార్ మీదుగా 6.30కి మహాత్మాగాంధీ రోడ్డుకు చేరుకుని రాత్రి 11 గంటల వరకు ఎంజీ రోడ్డులో పయనించి ఆ తర్వాత రాణిగంజ్‌లోని హిల్‌స్ట్రీట్ నుంచి తిరిగి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు ఆలయానికి చేరుకుంటుందని, భక్తులు తదానుగుణంగా దర్శనం కోసం రావచ్చని తెలిపారు.

బాధిత కుటుంబానికి రేషన్ అందజేత

పద్మారావునగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్, హమాల్‌బస్తీలో నివసించే లక్ష్మీ అనే మహిళ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు, పిల్లల ధ్రువపత్రాలు దగ్ధమైన విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొన్న బీజేపీ యువ నాయకులు మర్రి పురూరవరెడ్డి గురువారం ఉదయం హమాల్‌బస్తీలోని బాధిత కుటుంబ సభ్యులను కలసి వారికి నెలకు సరిపడా సరుకులను అందజేశారు. అలాగే ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందజేయటానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అడ్వకేట్ బాబురావు, తుమ్మల శ్రీకాంత్, అమర్‌నాథ్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్క్వాష్‌లో హృదయ ముందంజ


పోటీల్లోని దృశ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ స్క్వాష్ ఓపెన్ టోర్నమెంట్‌లో హృదయ జైన్ ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. గురువారం సికింద్రాబాద్ క్లబ్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్-13 విభాగంలో హృదయ 11-6, 11-9, 6-11, 11-8తో శరణ్యపై గెలిచింది. అండర్-11 కేటగిరీలో గౌరి 11-2, 11-1, 11-4తో శ్రీరత్నపై నెగ్గింది. బాలుర అండర్-15 విభాగంలో వివాన్ 11-7, 11-2, 11-0తో పృథ్వీరాజ్‌పై, అండర్-17 విభాగంలో వరుణ్ 11-4, 11-8, 11-1తో అభయ్‌పై గెలిపొందారు.

కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ మాజీ అధ్యక్షుడి మృతికి నివాళులు

బౌద్ధనగర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ మాజీ అధ్యక్షుడు ఉడతాల జిగ్ను యాదగిరి(75) బుధవారం సాయంత్రం సీతాఫల్‌మండి మైలార్‌గడ్డలో ఆయన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. కరడుకట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉంటూ సికింద్రాబాద్‌తో పాటు నగరంలో పలు పదవులను చేపట్టారు. గురువారం సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్ సామల హేమ, బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి, మేకల సారంగపాణి, ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవ ముదిరాజ్, దాసరి హరిలు ఆయన నివాసంలో యాదగిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.